ఈనాడు
శ్రీ సత్యసాయి
మంగళవారం అక్టోబరు 1, 2024

భూమి కబ్జా చేశారంటూ..
రైతు ఆత్మహత్యాయత్నం



ఒంటిపై పెట్రోల్ పోసుకొన్న రైతు దస్తగిరి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: తన భూమిని కబ్జా చేశారు.. ఎవ్వరూ న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ రైతు కలెక్టరేట్ వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య యత్నం చేసిన సంఘటన కలకలం సృష్టించింది.. సోమవారం ప్రజా పరిష్కార నివేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు నిడిమామిడికి చెందిన రైతు దస్తగిరి భార్య నాగినతో కలిసి కల్టెరేట్‌కు వచ్చారు. భార్యను ఫిర్యాదు చేసేందుకు లోపాలకు పంపిన రైతు.. న్యాయం చేయాలంటూ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్రమత్తమైన పోలీసులు రైతు చర్యలను అడ్డుకున్నారు. నిడిమామిడిలో 38 సెంట్ల భూమి ఉందని, అదే గ్రామానికి చెందిన వైకాపా నాయకులు మాబు, దస్తగిరి కబ్జా చేశారని, న్యాయం చేయాలని కోరారు. పలు మార్లు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకుని డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ రైతు వద్దకు వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సమగ్రంగా విచారణ చేసి రైతుకు న్యాయం చేయాలని ఆదేశించారు. రైతును పట్టణ సీఐ సునీత దిశ పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లారు. విచారణ చేపట్టిన రెవెన్యూ అధికారులు 38 సెంట్ల భూమి రైతు ఆధీనంలో ఉందని, ముందు భాగంలో ఉన్న భూమి వంకపోరంబోకు భూమిగా గుర్తించారు.

సంఘటనపై ఎస్పీ ఆరా..

కలెక్టర్ కార్యాలయానికి ఎస్పీ రత్న చేరుకుని జరిగిన సంఘటనపై ఆరా తీశారు. కార్యాలయంలోకి వెళ్లి జేసీ అభిషేక్‌కుమార్‌తో చర్చించారు. తక్షణమే కలెక్టరేట్ వద్ద ఎస్పీ బందోబస్తు చర్యలు చేపట్టారు. ఇలాంటి సంఘనటలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

పండగకు 368 టన్నుల కందిపప్పు



పుట్టపర్తి, న్యూస్‌టుడే: విజయదశమి పండగకు నిరుపేదల ఇంట్లో కందిపప్పు ఉడకనుంది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం కలిగించేలా ఎన్డీఏ కూటమి చర్యలు తీసుకుంది. రేషన్ కార్డుదారులకు కిలో కందిపప్పు అందించేందుకు దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కందిపప్పు సరఫరాపై దృష్టి సారించింది. గత ప్రభుత్వం పంపిణీదారులకు రూ.కోట్ల బకాయిలు పెట్టి ఉండటంతో పాటు, తూకాల్లో వ్యత్యాసం ఉండటం వల్ల సరఫరాకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో బియ్యం, చక్కెర, జొన్నలు, రాగులతో సరి పెట్టుకోవాల్సి వచ్చింది. ఈసారి విజయదశమి పర్వదినానికి జిల్లాలో 1,367 చౌకదుకాణాల ద్వారా 5,83,963 మంది లబ్ధిదారులకు మంగళవారం నుంచి బియ్యం, చక్కెర, జొన్నలతో పాటు కందిపప్పు పంపిణీ చేయనున్నారు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధర రూ.160 నుంచి రూ.175 వరకు ఉంది. చౌకదుకాణాల్లో రూ.67లకే ఇవ్వనున్నారు. లబ్ధిదారులకు 368 టన్నులు అవసరం ఉండగా, ఇప్పటి వరకు 56 టన్నులు చౌక దుకాణాలకు సరఫరా చేయడం జరిగిందని, రెండ్రోజుల్లో పూర్తి స్థాయిలో పంపిస్తామని పౌరసరఫరాల అధికారి అశ్వర్థనారాయణ తెలిపారు.

ఆన్‌లైన్ అయ్యేనా..
అక్రమాల నిగ్గు తేలేనా?

- పీఏసీఎస్‌ల్లో దస్త్రాల కంప్యూటరీకరణపై మల్లగుల్లాలు
- అవినీతి దందా బయటపడుతుందనే ప్రక్రియ ఆలస్యం



గతేడాది కనగానపల్లి పీఏసీఎస్ పరిధిలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. రామగిరి మండలానికి చెందిన రైతు తాను తీసుకున్న రూ.4 లక్షల అప్పును కట్టేశారు. అప్పటి పీఏసీఎస్ సీఈవో.. రైతుతో తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకున్నారు. డబ్బును బ్యాంకులో డిపాజిట్ చేయకుండా సొంతానికి వాడుకున్నారు. తర్వాత రైతు విషయం తెలుసుకుని ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. సీఈవో నుంచి రికవరీ చేసి.. ఎలాంటి చర్యలు తీసుకోకుండానే వదిలేయడం గమనార్హం.



కూడేరు సొసైటీ పరిధిలో నకిలీ పాసు పుస్తకాలు పెట్టి పెద్ద మొత్తంలో రుణాలు పొందారు. ఇందుకు సొసైటీ అధికారులు సహకరించారు. కూడేరులో ఒకే కుటుంబానికి 22 రుణాలు ఇచ్చారంటే ఏస్థాయిలో అవినీతి జరిగిందో అర్థం చేసుకోవచ్చు. సొసైటీ సభ్యులు షేర్ క్యాపిటల్‌గా ఇచ్చిన సొమ్మును సైతం సొంతానికి వాడుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఎన్‌పీఏగా మారిన వ్యక్తుల వారసులకు రుణాలు మంజూరు చేయడం వంటి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో సీఈవో రాజీనామా చేసి వెళ్లిపోవడం గమనార్హం.



ఈనాడు డిజిటల్, పుట్టపర్తి, న్యూస్‌టుడే, ఉరవకొండ

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) దస్త్రాల కంప్యూటరీకరణ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయితే తాము చేసిన అక్రమాలు బయటపడతాయనే భయంతో ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తున్నారు. అక్టోబరు 2తో గడువు ముగుస్తోంది. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలోని ఒక్క సొసైటీలోనూ ప్రక్రియ పూర్తికాలేదు. మరికొన్నింటిలో పనే మొదలుపెట్టకపోవడం గమనార్హం. సాంకేతిక కారణాలను చూపి కంప్యూటరీకరణ ముందుకు సాగకుండా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అన్నీ ఉన్నా..

ఉమ్మడి జిల్లాలో ఒక్కో సొసైటీకి కంప్యూటర్, ప్రింటర్, స్కానర్, ఈ-పాస్ మిషన్‌తోపాటు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు. కంప్యూటరీకరణకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి తీసుకొచ్చారు. గతేడాది ఆరంభంలో ప్రక్రియ మొదలుపెట్టాలని కేంద్రం ప్రభుత్వం చెప్పినా అప్పటి వైకాపా సర్కారు నిర్లక్ష్యం చేస్తూ వచ్చింది. వైకాపా నాయకుల అక్రమాలు బయటపడతాయని కనీసం పరికరాలను బయటకు తీయలేదు. తెదేపా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని పీఏసీఏస్‌లలో కంప్యూటర్లను బయటికి తీశారు. ఏడీసీసీ బ్యాంకు ఉన్నతాధికారులు సైతం ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. ఇటీవల కలెక్టర్ ఆదేశించినా పరిస్థితిలో మార్పు రావడం లేదు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

మొత్తం సహకార సంఘాలు	118
వివిధ రకాల రుణాలు	రూ.1,300 కోట్లు
బకాయిలు	రూ.130 కోట్లు
డిఫాల్ట్ అయిన సొసైటీలు	70
కంప్యూటరీకరణ పూర్తయినవి	0
తుది గడువు	అక్టోబరు 2

విడతల వారీగా పూర్తి చేస్తాం

- వినోద్‌కుమార్, కలెక్టర్, అనంతపురం

పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఏడీసీసీ బ్యాంకు అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. అక్టోబరు 2 నాటికి మొదటి విడత పూర్తి చేస్తాం. క్షేత్రస్థాయిలో కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నట్లు అధికారులు మా దృష్టికి తీసుకొచ్చారు. విడతల వారీగా ఆన్‌లైన్ ప్రక్రియ చేపడతాం.

ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పట్ల నిర్లక్ష్యం చేయకుండా క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జేసీ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జేసీ అధికారులతో కలిసి అర్జీలు స్వీకరించారు. దిన పత్రికల్లో వచ్చే కథనాలకు వెంటనే స్పందించి, పరిష్కరించి, తగు వివరణ ప్రచురించాలని ఆదేశించారు. ఏ స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలు ఆ స్థాయిలోనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ సమస్యలకు క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని సూచించారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, వివిధ శాఖల జిల్లా అధికారులు లు పాల్గొన్నారు.

పథకం కేంద్రానిది..
ప్రచారం వైకాపాది!



రాప్తాడు గోదాములో మూలకు చేరిన బోర్డులు

కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. తెల్లకార్డుదారులందరికీ ఉచితంగా బియ్యం పంపిణీ చేయాలన్నదే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. అందులో భాగంగానే 'మోదీ ప్రభుత్వం ఇస్తున్న భరోసా.. అందరికీ ధాన్యం ఆరోగ్యవంతమైన సమాజం' పేరుతో భారత ప్రభుత్వం వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వశాఖ ద్వారా ఫ్లెక్సీలు తయారు చేయించి ఉమ్మడి జిల్లా పౌరసరఫరాల శాఖకు పంపారు. కార్డుదారులకు తెలిసేలా ప్రతి చౌక దుకాణంలో వాటిని తగిలించాలి. అలాకాకుండా ఉమ్మడి జిల్లాలోని 24 మండల లెవెల్ స్టాక్ పాయింట్లు(ఎంఎల్ఎస్)లో ఫ్లెక్సీలను మూలన పడేశారు. వైకాపా ప్రభుత్వం జగన్‌మోహన్ రెడ్డి పేరుతో ఉన్న ఫ్లెక్సీలు తయారు చేయించి చౌక దుకాణాలకు తగిలించారు. అప్పట్లో ఉచిత బియ్యం కేంద్రమిస్తే.. వైకాపా నాయకులు తమ పేర్లు చెప్పుకోవడాన్ని భాజపా నాయకులు పూర్తిగా తప్పుబట్టారు. ఆందోళనలు సైతం చేశారు. దీనిపై అనంతపురం జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రమేశ్‌రెడ్డిని వివరణ కోరగా ఫ్లెక్సీలను చౌక దుకాణాలకు సరఫరా చేశాం. మిగిలినవి గోదాముల్లో ఉన్నాయని చెప్పారు.

- న్యూస్‌టుడే, అనంతపురం (కళ్యాణదుర్గం రోడ్డు)

శిశువులకు భద్రత ఏదీ?



హిందూపురంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో మాతాశిశు కేంద్రం

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురంలోని బసవతారకరామ మాతాశిశు ఆసుపత్రిలో శిశువులకు రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. గతంలోనూ ఈ కేంద్రంలో బిడ్డల అపహరణకు సంబంధించిన వరుస ఘటనలు చోటుచేసుకున్నా తగిన భద్రతా చర్యలు కనిపించడం లేదు. ప్రసవం జరిగిన తర్వాత వారు ఇంటికి వెళ్లే వరకు తల్లీ బిడ్డకు ట్యాగ్‌లు ఏర్పాటు చేయాలి. మూడు రోజుల ముచ్చట అన్నట్లు వీటిని కొన్నాళ్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి ఏ తల్లీబిడ్డకు కనిపించడం లేదు. పైగా ఈ కేంద్రం రహదారికి అతి సమీపంలో ఉండటంతో పాటు నివాస ఇళ్లుకూడా లేవు. దీంతో రాత్రిళ్లు తల్లి నిద్రించే సమయంలో శిశువులకు రక్షణ లేని పరిస్థితి నెలకొంది. ఈ కేంద్రానికి పోలీస్ అవుట్ పోస్ట్ కార్యాలయం కూడా దూరంగా ఉంది. ఆసుపత్రికి సెక్యూరిటీ సిబ్బంది ఉన్నప్పటికీ గతంలో ప్రసవం జరిగిన మహిళ బంధువుల తరహాలో లోపలికి వెళ్లి బిడ్డను తీసుకెళ్లటానికి ప్రయత్నించగా అక్కడున్న వారు గుర్తించి పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం తగిన భద్రత ఏర్పాటు చేయకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతం అయ్యే ప్రమాదం లేకపోలేదనే వాదనలు వినిపిస్తున్నాయి.



ట్యాగులు లేవు.. సీసీ కెమెరాలు పనిచేయవు



తల్లీబిడ్డ వద్ద కనపడని ట్యాగ్‌లు

కొరవడిన నిఘా..

ఈ కేంద్రంలో చికిత్సలు, ప్రసవాలకు వచ్చే వారు, వారి బంధువులను గుర్తించటానికి దాదాపు 9 ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కెమెరాలు తరచూ మొరాయిస్తూ సక్రమంగా పనిచేయటం లేదు. దీనివల్ల కేంద్రంలోకి ఎవరు వస్తున్నారో గుర్తించటం సాధ్యం కావటం లేదు. అందువల్ల అధికారులు వెంటనే చర్యలు తీసుకొని సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ట్యాగుల విషయంపై విచారణ చేస్తాం

- రోహిల్‌కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్

ఆసుపత్రిలో తల్లీబిడ్డలకు ట్యాగులు ఏర్పాటు చేస్తున్నారు. ఎంతకాలం నుంచి ఎందువలన ఏర్పాటు చేయలేదో అనే విషయంపై విచారణ చేస్తా. ఆసుపత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటానికి టెండర్లు పిలిచాం. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం.

ఉమ్మడి జిల్లాలో 223 మద్యం దుకాణాలకు ప్రకటన

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: కొత్త మద్యం విధానం నేటి (మంగళవారం)నుంచి అమల్లోకి రానుంది. మద్యం దుకాణాలకు నోటిఫికేషన్, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య వెల్లడించారు. సోమవారం అనంతపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అక్టోబరు 1 నుంచి 9 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆన్‌లైన్ లేదంటే ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చన్నారు. ఆన్‌లైన్‌కు సంబంధించి ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుందన్నారు. నేరుగా దరఖాస్తులు సమర్పించే వారికి ఉమ్మడి అనంత జిల్లాలోని 18 ఎక్సైజ్ స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. సచివాలయం నుంచి డిజిటల్ అసిస్టెంట్, బ్యాంకు ఉద్యోగి అందుబాటులో ఉండి సహకరిస్తారన్నారు. టెండరు ప్రక్రియ ఈనెల 11తో పూర్తి అవుతుందని, 12 నుంచి కొత్త దుకాణాలు అందుబాటులోకి వస్తాయని డీసీ వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లు శ్రీరామ్, రేవతి సుబ్రహ్మణ్యం, ఇన్‌స్పెక్టర్ జయనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపి తక్షణం పరిష్కరించండి: ఎస్పీ



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చే సమస్యలను చట్టపరిధిలో విచారణ జరిపి తక్షణ పరిష్కారం చూపాలని ఎస్పీ రత్న ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి సివిల్, ఆస్తి, కుటుంబ కలహాలు, సైబర్ నేరాలకు సంబంధించి 57 ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై సంబంధిత పోలీసు అధికారులకు చరవాణి ద్వారా తెలియజేసి చట్ట పరిధిలోని ఫిర్యాదులను విచారణ జరిపి తక్షణం పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల నేడు పంపిణీ

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. మంగళవారం ఉదయం 5గంటల నుంచే వార్డు, గ్రామ సచివాలయ సిబ్బంది 9,551 మంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. మొత్తం 2,67,238 మంది లబ్ధిదారులకు రూ.114.78 కోట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పింఛన్ల పంపిణీలో జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని వివరించారు.

పప్పుశనగ విత్తన ధరలు ఖరారు

25 శాతం రాయితీతో పంపిణీ



అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంత జిల్లాలోని నల్లరేగడి నేలల్లో రబీలో సాగు చేసే రైతులకు రాయితీతో పంపిణీ చేసే పప్పుశనగ విత్తన ధరలు ఖరారయ్యాయి. 25 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సోమవారం వ్యవసాయశాఖ కమిషనర్ డిల్లీరావు ఉత్తర్వులు జారీ చేశారు. జేజీ-11, కేఏకే-2 కాబూలి రకం విత్తనాలు మంజూరయ్యాయి. అనంతపురం జిల్లాకు 27,139 క్వింటాళ్లు, శ్రీసత్యసాయి జిల్లాకు 1,143 క్వింటాళ్లు కేటాయించారు. జేజీ-11 విత్తనం ధర కిలో రూ.94 కాగా రూ.23.50 రాయితీ పోను మిగిలింది చెల్లించాలి. కేఏకే-2 కాబూలి రకం ధర కిలో రూ.120 కాగా రూ.30.25 రాయితీ ఇవ్వనున్నారు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా ఐదెకరాలకు 10 బస్తాలు (బస్తాకు 20 కిలోలు) చొప్పున రాయితీ పప్పుశనగ విత్తనం పంపిణీ చేయనున్నట్లు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వ్యవసాయాధికారులు ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు తెలిపారు.

మేమున్నాం..
ప్రాణం నిలబెడతాం!

- అందుబాటులో ఆపద్బాంధవులు
- నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం



సృష్టిలో ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ దానం చేయగలిగే అవకాశం ఉన్నది రక్తదానం. మిగిలిన ఏ సాయాన్నీ రక్తదానంతో పోల్చలేం. మతం, కులం, ప్రాంతం ఏదైనా.. మానవత్వాన్ని ఎలుగెత్తి చాటే మహాదానమిది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొందరు ఆపద వేళ.. మేమున్నామంటూ ఎందరికో పునర్జన్మనిస్తున్నారు. ఎక్కడైనా.. ఎప్పుడైనా రక్తదానానికి సిద్ధమంటున్నారు.

అతివలకు ఆదర్శం మణిప్రియ



హిందూపురం అర్బన్: హిందూపురానికి చెందిన **మణిప్రియ** ఓ ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్నారు. ప్రతి మూడు మాసాలకు ఓసారి ప్రభుత్వాసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నారు. ఇప్పటికే 15 సార్లు ఇచ్చారు. రక్తదానంలోనూ మహిళలు ముందుండాలని ఆమె పిలుపునిస్తున్నారు.

మూడు నెలలకోసారి విధిగా..



తాడిపత్రి: పట్టణానికి చెందిన **తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి** రక్తగ్రూపు బి-పాజిటివ్. ఇప్పటి వరకు 43 సార్లు రక్తదానం చేశారు. రెండు పర్యాయాలు బాధితుల ప్రాణాలు కాపాడారు. ఆ సమయంలో బాధిత కుటుంబసభ్యుల కళ్లల్లో చూసిన ఆనందం ఎంతో సంతృప్తి ఇచ్చిందంటున్నారు. ప్రతి మూడు నెలలకు రక్తం ఇవ్వడం అలవాటుగా మార్చుకున్నారు.

✆ సంప్రదించాల్సిన నంబరు: 94410 12632

యువ రెడ్-ప్లస్



గుత్తి: గుత్తిలో ఉంటున్న 19 మంది యువకులు రెడ్-ప్లస్ రక్తదాతల సంస్థ ఏర్పాటు చేసి ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్నారు. స్వచ్ఛందంగా సేవ చేయడానికి వెయ్యి మంది దాతలు ఉండటం విశేషం. ముఖ్యంగా గర్భిణులను కాపాడటమే లక్ష్యంగా సాగుతున్నారు. పదుల సంఖ్యలో మహిళల ప్రాణాలు కాపాడారు. సంస్థ తరపున సొంత ఖర్చులతో ఏడు వేల మందికి రక్తదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు **షేక్షావలి...** తన బంధవులకు రక్తమందక మరణించని ఘటనతో రక్తదాతగా మార్చాయి. ఉమ్మడి జిల్లాలో తన మిత్రులను రక్తదానానికి ప్రోత్సహిస్తున్నారు.

✆ 98859 81974

ఇద్దరిని కాపాడారు..



ధర్మవరం: పట్టణానికి చెందిన శ్రీనివాసులు రక్తదాన సేవలో తరిస్తున్నారు. రక్తగ్రూపు ఎ-నెగిటివ్. అత్యవసర పరిస్థితుల్లో ఎప్పుడు.. ఎవరు సంప్రదించినా ఆలోచించకుండా వెళ్తుంటారు. ధర్మవరం, అనంతపురం, బత్తలపల్లి ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో తన చరవాణి, చిరునామా వివరాలిచ్చారు. 20 సార్లు రక్తం ఇచ్చారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో దాదాపు 18 సార్లు గర్భిణులను ఆదుకున్నారు. మడకశిర, ఉరవకొండలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడితే అనంతపురానికి తీసుకొచ్చారు. రక్తమిచ్చి ప్రాణాలు కాపాడారు.

✆ 94404 94045

131 సార్లు దానం..



గుంతకల్లు: పట్టణానికి చెందిన రెడ్‌డ్రాప్ రక్తదాతల సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రహమాన్ 131 సార్లు రక్తదానం చేశారు. రక్తం అందక తన తండ్రి మరణించారని, ఆ పరిస్థితి ఎవరికీ రాకూడదని సంస్థను ఏర్పాటు చేశారు. ఓ సారి ఆపోలో ఆసుపత్రిలో కడపకు చెందిన ప్రదీప్‌కు రక్తం అవసరమొచ్చింది. హైదరాబాద్‌కు వెళ్లి రక్తమిచ్చి ప్రాణాలు కాపాడారు. ఈకోవలోనే ఎంతో మంది గర్భిణులకు ఆపద్బాంధవుగా నిలిచారు.

✆ 96962 22666

అరుదైన గ్రూపుతో ఆదుకుంటూ..



ఉరవకొండ: ఉరవకొండకు చెందిన నిమ్మల వెంకటేశ్ హెల్త్‌అసిస్టెంట్. రక్త గ్రూపు బి-నెగిటివ్. అరుదైన రక్తగ్రూపుగా పరిగణిస్తారు. 39 సార్లు రక్తదానం చేశారు. గర్భిణికి ప్రాణాపాయస్థితిలో రక్తం ఇచ్చి కాపాడారు. గుంతకల్లులో ఓ బాలిక తలసేమియాతో బాధపడేది. ఆరు నెలల్లో వరుసగా మూడు సార్లు రక్తమిచ్చారు.

✆ 90143 44413

శిబిరాలు ఏర్పాటు చేసి..



పామిడి : రక్తం సమయానికి అందకపోవడంతో ఓ గర్భిణి చనిపోయిన ఘటన పామిడి అంబేడ్కర్ కాలనీకి చెందిన పీటర్ విజయ్‌ను కదిలించింది. అప్పటి నుంచి ఆ పరిస్థితి రాకూడదని రక్తదాతగా మారారు. 1997లో అబ్దుల్ కలాం స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 98 సార్లు రక్తదానం చేశారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి.. దాదాపు 4 వేల రక్తప్యాకెట్లను వివిధ రక్తనిధి కేంద్రాలకు అందించారు.

✆ 99632 96475



వరద బాధితులకు విరాళం

విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాష్ట్ర ముతవల్లీల సంఘం రూ.7,86,000 అందించింది. సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షకీల్ షఫీ ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు చెక్కు అందజేశారు. ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఉబెదుల్లా సాహెబ్, కోశాధికారి సయ్యద్ తాజ్ బాబా సాహెబ్, సభ్యులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, పెనుకొండ

3 నుంచి దసరా మహోత్సవాలు

కదిరి, న్యూస్‌టుడే: ఖాద్రీ నరసింహస్వామి ఆలయంలో ఈనెల 3 నుంచి దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయా అలంకారాల్లో స్వామివారు దర్శనమిచ్చే ఉత్సవాలు ఈనెల 3న మొదలై 12న ముగుస్తాయని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలి: మంత్రి



మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: దసరా, దీపావళి పండగలకు ప్రజలందరూ చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలను ఆదరించి అండగా నిలవాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. ఈసందర్భంగా సోమవారం పట్టణంలోని మంత్రి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేనేతలకు అండగా ఉటుందన్నారు. చేనేతలకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. నేటి తరం యువతీ యువకుల అభిరుచులకు అనుగుణంగా చేనేత రంగంలో నూతన డిజైన్లపై కార్మికులకు శిక్షణ ఇస్తున్నాం. కేవలం శిక్షణతో సరిపెట్టకుండా తయారు చేసిన వస్త్రాలకు మార్కెట్ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. గతంలో విజయవాడలో ఏర్పాటుచేసిన వస్త్ర ప్రదర్శనలో రూ.3కోట్ల వ్యాపారం నిర్వహించామన్నారు. పెద్దపెద్ద మాల్స్‌లో సైతం చేనేత స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నేటి నుంచి గుంటూరులో ప్రదర్శన

అక్టోబరు 1 నుంచి 14వ తేదీ వరకు రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన గుంటూరులో నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రదర్శనలో దేశవ్యాప్తంగా 80చేనేత సంఘాలు, సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. వీటిలో నూలు చీరలు, పట్టుచీరలు, పావడాలు, దుప్పట్లు, కలంకారీ మొదలగు చేనేత ఉత్పత్తులు అమ్మకం జరుగుతుందన్నారు. గుంటూరు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కానిస్టేబుల్ మంజమ్మకు కాంస్య పతకం

జిల్లా ఎస్పీ రత్న, డీఎస్పీ మహేశ్ అభినందనలు



కాంస్య పతకంతో మంజమ్మ

హిందూపురం, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ విభాగం యోగా మహిళా పోటీల్లో హిందూపురం గ్రామీణ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ మంజమ్మ కాంస్య పతకం సాధించారు. చండీగఢ్ రాష్ట్రంలోని బిలాయి పట్టణం అగ్రసేన్ భవనంలో సెప్టెంబరు 23 నుంచి 27 వరకు ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ యోగా మహిళా పోటీల్లో మంజమ్మ పాల్గొని ప్రతిభ కనబరచి మూడో స్థానంలో నిలిచారు. సోమవారం మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ ఆఫీసర్ రేణుకాబిరెడ్డి ఆధ్వర్యంలో డీజీపీ ద్వారకా తిరుమలరావును మర్యాదపూర్వకంగా కలిసి అభినందలు అందుకున్నారు. మంజమ్మ కాంస్య పతకం సాధించి రాష్ట్రస్థాయిలో జిల్లా పోలీస్ ప్రతిష్ఠను పెంచిందని జిలా ఎస్పీ రత్న అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీతో పాటు హిందూపురం డీఎస్పీ కేవీ మహేశ్ మంజమ్మకు అభినందనలు తెలిపారు.

ఎస్కేయూ ఏఐసీకి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఎస్కేయూ ఆచార్య నాగభూషణరాజు

ఎస్కేయూ: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్(ఏఐసీ)కి 'ఉత్తమ గ్రామీణ ఇంక్యుబేటర్' పురస్కారం దక్కింది. ఇటీవల హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా కళాశాలలో జరిగిన అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్‌లో అపోలో హాస్పిటల్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి ఈ పురస్కారం అందజేశారు. ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఈడీ ఆచార్య నాగభూషణరాజు ఈ పురస్కారం అందుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్టార్టప్స్ ఏర్పాటుకు కృషి చేసినందుకు ఈ పురస్కారం దక్కినట్లు ఆయన తెలిపారు.

'ఒప్పంద, పొరుగు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి'

అనంతపురం(శ్రీనివాస్‌నగర్): జిల్లాలో అనేక శాఖలు, పరిశ్రమల్లో పని చేస్తున్న ఒప్పంద, పొరుగు ఉద్యోగులను సత్వరమే క్రమబద్ధీకరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండు చేశారు. సోమవారం అనంత నగరంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆ తర్వాత కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఓబులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం అర్హత కలిగిన ప్రతి పొరుగు, ఒప్పంద సేవల ఉద్యోగులను సత్వరమే క్రమబద్ధీకరించి, సమాన పనికి సమాన వేతనం అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఐడీ చట్టం ప్రకారం 240 రోజులు పని చేసిన కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా తీసుకోవాలన్నారు. అనంతరం డీఆర్ఓ రామకృష్ణారెడ్డికి వినతి అందించారు. సీఐటీయూ నాయకులు నాగేంద్ర, నాగమణి, గోపాల్, రామాంజనేయులు, వెంకటనారాయణ, శివప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

మాయమాటలు చెప్పి.. బంగారు ఆభరణాలతో పరారీ



సీసీ కెమెరాలో నిక్షిప్తమైన దొంగల చిత్రం

రాప్తాడు, న్యూస్‌టుడే: ఇద్దరు దుండగులు వృద్ధ దంపతులకు మాయమాటలు చెప్పి బంగారు ఆభరణాలతో ఉడాయించారు. ఈ ఘటన అనంతపురం గ్రామీణం పరిధిలోని ఆకుతోటపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ వివరాల మేరకు.. ఎస్కేయూలో సూపరింటెండెంట్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన సుబ్రహ్మణ్యంనాయుడు, భార్య రామలక్ష్మితో కలసి ఆకుతోటపల్లి సాయిబాబ ఆలయం వద్ద నివాసం ఉంటున్నారు. ఆయన కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వారి ఇంటి వద్దకు వచ్చారు. పక్షవాతానికి కేరళలో ఓ సంస్థ ఉచితంగా వైద్యం అందిస్తుందని మాట కలిపారు. అది పేద వారికి మాత్రమేనని నమ్మించారు. ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు తీసి పక్కన పెట్టాలని, మీ ఫొటోలు తీసి వారికి పంపుతామని చెప్పారు. ఆ విధంగానే వృద్ధులిద్దరూ 30గ్రాముల బంగారు ఆభరణాలను తీసి మంచంపై ఉంచారు. ఇంటి లోపలికి వెళ్లి నడుచుకుంటూ రావాలని ఆ ఫొటోలు తీసి పంపుతామని చెప్పడంతో దంపతులు అలాగే చేశారు. దుండగులు ఆభరణాలతో ద్విచక్ర వాహనంపై ఉడాయించారు. బాధితులు 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ఇటుకలపల్లి పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సామాజిక వన విభాగం ఆర్వో పోస్టుల ఎత్తివేత

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో సామాజిక వన విభాగంలో పనిచేస్తున్న రేంజ్ ఆఫీసర్ల (ఆర్వో) పోస్టులను ఎత్తేశారు. ఇక్కడ పని చేస్తున్న వారిని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఈ మేరకు చీఫ్ కన్జర్వేటివ్ అధికారి నాగేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న రేంజర్ డేవిడ్‌ను కర్నూలు జిల్లా ఆత్మకూరుకు, శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ రేంజర్ ఉదయదీప్‌ను గుండ్లబ్రహ్మేశ్వరమ్మకు, బుక్కపట్నం రేంజర్ వెంకటసుబ్బుడును చిత్తూరు తూర్పుకు బదిలీ చేశారు. ఆయా పోస్టుల్లో జిల్లా అటవీశాఖ పరిధిలో పనిచేసే రేంజ్ ఆఫీసర్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అనంతపురం ఆర్వోగా శ్రీనివాసులు, బుక్కపట్నం ఆర్వోగా శ్రీనివాసరెడ్డి, పెనుకొండ ఆర్వోగా గుర్రప్పకు బాధ్యతలు అప్పగించారు.

సాంకేతిక సహాయకుడి సస్పెన్షన్

బుక్కపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని గూనిపల్లి క్లస్టర్‌లో ఉపాధిహామీ పథకంలో సాంకేతిక సహాయకుడిగా పనిచేస్తున్న సికిందర్ జహాపనాపై సస్పెన్షన్ వేటు పడింది. ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపిన మేరకు వివరాలు.. గూనిపల్లి క్లస్టర్ ఉపాధి పథకంలో సాంతికేక సహాయకుడు సికిందర్ జహాపనా పలు అక్రమాలకు పాల్పడ్డారని గ్రామానికి చెందిన ఉద్యాన రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. దీంతో సాంకేతిక సహాయకుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

తెదేపా కార్యకర్తపై వైకాపా వర్గీయుడి దాడి



గాయపడిన లక్ష్మణస్వామిని పరామర్శిస్తున్న భాజపా, తెదేపా నాయకులు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన లక్ష్మణస్వామిపై సోమవారం ఎన్జీవో కాలనీ సర్కిల్ వద్ద వైకాపా వర్గీయుడు మల్లికార్జునరెడ్డి దాడి చేశాడు. గాయపడిన లక్ష్మణస్వామిని స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ద్విచక్ర వాహనంలో వెళుతున్న తనపై మల్లికార్జునరెడ్డి దూషణకు దిగి రాయితో తలపై కొట్టాడని బాధితుడు ధర్మవరం 2వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి కాటమయ్య, నాయకులు కొత్తపేట రాఘవ, ఆది, పురుషోత్తంగౌడ్, మంత్రి సత్యకుమార్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్ తదితరులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని ఆరా తీశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో తెదేపా ఏజెంటుగా ఉన్నానని, గతంలోనూ మల్లికార్జునరెడ్డి బెదిరింపులకు దిగాడని లక్ష్మణస్వామి ఆరోపించాడు. ఇప్పుడు రహదారిపై వెళుతుండగా దాడి చేశాడని వాపోయాడు. 2వ పట్టణ పోలీసులు మల్లికార్జునరెడ్డిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

యాడికి, న్యూస్‌టుడే : విద్యుదాఘాతానికి గురై ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన యాడికిలో సోమవారం జరిగింది. లాలెప్ప తోటలో ఉంటున్న నాగమ్మ(85) సాయంత్రం ఇంట్లోని మరుగుదొడ్డిలోకి వెళ్లింది. అక్కడ తెగి ఉన్న విద్యుత్తు తీగ గమనించక పోవడంతో, అదికాస్త ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు.

వేరుసెనగ దిగుబడి భేష్



కళకళలాడుతున్న పంట



కాయలు చూపుతున్న రైతు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేరుసెనగ పంటను అధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేస్తారు. గత రెండేళ్లుగా వర్షాభావంతో పంటలు ఎండిపోయి నష్టాలు చవి చూశారు. ముదిగుబ్బ మండలం పొదరళ్లపల్లి గ్రామానికి చెందిన రైతు నాగేశ్వర్ మాత్రం ఏటా వేరుసెనగ సాగు చేస్తూ మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. బోరు కింద రెండు ఎకరాల్లో పంట సాగు చేసి 40 క్వింటాళ్ల దిగుబడి సాధించడం విశేషం.

రైతేరాజు

సాగు విధానం: గత జూన్‌లో కదిరి కె-6 రకం వేరుసెనగ విత్తనాలను ఎకరాకు 120 కిలోల చొప్పున శుద్ధి చేసి రెండు ఎకరాల్లో ఇరుసాల సాగు చేశారు. అంతకుముందు భూమిని లోతుగా దున్నించి పేడ ఎరువులు బాగా వేశారు. విత్తు సమయంలో సూపర్ పాస్ఫేట్, పొటాష్, యూరియా వినియోగించారు. 30 రోజుల తర్వాత తొలి పూత దశలో యూరియా, ఊడలు దిగే సమయంలో వేరుసెనగ మొదళ్ల దగ్గర జిప్సం వేశారు. ఆకు పసుపు పచ్చగా మారడం, ఆకు ముడత వ్యాధులకు జింక్ సల్ఫేట్, సెట్రిల్ ఆమ్లం నీటిలో కలిపి పిచికారీ చేశారు. విత్తు వేసింది మొదలు ఎరువులు, మందులు, కూలీ సేద్యం ఖర్చులన్నీ కలిపి రూ.60వేలు పెట్టుబడి పెట్టారు.

రూ.2.64 లక్షల ఆదాయం: వేరుసెనగ సాగులో సాధారణంగా ఎకరాకు 20 నుంచి 30 సంచుల దిగుబడి వస్తుంది. సారవంతమైన భూమితోపాటు రసాయన ఎరువులు బాగా వినియోగించడంతో కాయల పరిమాణం పెరిగి నాణ్యతగా వచ్చాయి. ఇటీవల పంట కోత కోయగా ఎకరాకు 45 సంచుల చొప్పున రెండు ఎకరాల్లో 90సంచులు (ఒక సంచి 46 కిలోలు) దిగుబడి వచ్చింది. సంచి రూ.3,600తో దళారులకు విక్రయించగా రూ.3,24,000 రాబడి వచ్చింది. పెట్టుబడి పోనూ రూ.2,64,000 మిగిలినట్లు రైతు తెలిపారు.

సమస్య-సమాధానం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: పంటల సాగులో ఎలాంటి సందేహాలున్నా రైతులు రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త నజీరుద్దీన్ 99665 05285 నంబరుకు ఫోన్ చేసి తగిన సలహాలు, సూచనలు పొందవచ్చు.

సమస్య: రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాం. పంట 30 రోజుల దశలో ఉంది. ఆకులు ఊదా రంగులోకి మారుతున్నాయి. ఎలా నివారించాలి. - **శంకర్ (బొందలవాడ)**

సమాధానం: మొక్కజొన్న ఆకులు ఊదా రంగులోకి మారితే భూసార లోపం అని గుర్తించాలి. సమస్యను అధిగమించడానికి డీఏపీ 20 గ్రాములు, 19:19:19 ఎరువును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

సమస్య: నాలుగు ఎకరాల్లో వంగ తోట సాగు చేశాం. పంటకు కాయపుచ్చు తెగులు ఆశించింది. నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి. - **ఏసయ్య(జంతులూరు)**

సమాధానం: వేప మందు 3 మి.లీ, ప్రొఫినోఫాస్ 2 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పశు బీమా.. పాడి రైతులకు ధీమా



రాప్తాడులో బీమా చేసిన ఆవుకు వేసిన ట్యాగ్

రాప్తాడు, న్యూస్‌టుడే: పాడి పరిశ్రమ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. పశువులతోపాటు గొర్రెలు, మేకలు తదితర వాటికి బీమా వర్తింపజేసింది. పశువు మరణించిన రోజుల వ్యవధిలోనే సంబంధిత రైతులకు సాయం అందుతుంది.

ఎంత చెల్లించాలి: పశువులకు బీమా చెల్లింపులో రూ.15 వేలకు రూ.960 ప్రీమియం కట్టాలి. ఇందులో ఎస్సీ, ఎస్టీ రైతులు 80 శాతం రాయితీ అంటే రూ.192 చెల్లించాలి. ఇతరులు 50 శాతం కట్టాలి. నాటు పశువులకు రూ.15 వేలు, మేలుజాతి పశువులకు రూ.30వేల వరకు బీమా సదుపాయాన్ని ప్రభుత్వం అమలు చేయనుంది. పాడి రైతులు రూ.30 వేల కంటే అదనంగా బీమా చేసుకోవాలని భావిస్తే అదనపు ప్రీమియం చెల్లించాలి. ఒక్కో పశువుకు గరిష్ఠంగా రూ.1.10లక్షల వరకు బీమా చేసుకోవచ్చు.

నిబంధనలివే..: బీమా కావాలనుకునే రైతులు బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్‌కార్డు, ఎస్సీ, ఎస్టీలు తెల్లరేషన్ కార్డు జత చేయాలి. పశువులు మృతి చెందిన వెంటనే సమీపంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. బీమా సర్వే సిబ్బంది వచ్చే వరకు పశువుల చెవికి వేసిన ట్యాగ్‌ను తొలగించకూడదు. బీమా చేసిన పశువులను విక్రయిస్తే ఏడు రోజుల్లోగా కంపెనీ వారికి తెలియజేసి కొనుగోలుదారుడి పేరుపై మార్చాలి.

అవగాహన కల్పిస్తున్నాం

- **ప్రకాశ్, పశుసంవర్ధక శాఖ ఏడీ, రాప్తాడు**

పశు బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం అందించే రాయితీలను, వాటి ఉపయోగాలను తెలియజేసి, సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నాం.

డ్రాగన్ ఫ్రూట్‌తో లాభాలు



సాగైన పంట, అంతర చిత్రంలో పండ్లు

నార్పల, న్యూస్‌టుడే: నార్పలకు చెందిన రైతు రామకృష్ణ డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తూ రూ.లక్షల్లో ఆదాయం గడిస్తున్నారు. గతంలో ఆయన వేరుసెనగ, కంది, ఆముదం, జొన్న పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయారు. ఉద్యానశాఖ అధికారుల సూచనలతో మూడేళ్ల కిందట కేశేపల్లి దారిలో ఉన్న రెండెకరాల్లో డ్రాగన్ ఫ్రూట్స్ పంట సాగు చేశారు. ఎకరా విస్తీర్ణంలో 5 వేల మొక్కలకుపైగా నాటారు. రెండు ఎకరాల్లో పంట సాగుకు రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టారు. మొక్కలు నాటిన ఏడాది తర్వాత దిగుబడి ప్రారంభమైంది. పండ్లను మార్కెట్‌కు తరలించకుండా పొలం వద్దే కూలీలను ఏర్పాటు చేసుకొని విక్రయిస్తున్నారు. కిలో రూ.150 చొప్పున రోజూ 50 కిలోలకుపైగా అమ్ముతున్నారు. ఆ లెక్కన నిత్యం రూ.7,500 ఆదాయం వస్తోంది. ఏటా ఖర్చులు పోనూ నికరంగా రూ.10 లక్షలకుపైగా ఆదాయం వస్తుందని రైతు చెబుతున్నారు. ఇప్పటి వరకు రూ.20 లక్షల వరకు చేతి కందినట్లు తెలిపారు. డ్రాగన్ ఫ్రూట్ పంటకు చీడపీడలు, తెగుళ్ల బెడద ఉండదు. పెట్టుబడి ఖర్చులు తక్కువే. ఒకసారి సాగు చేస్తే 30ఏళ్ల పాటు దిగుబడి చేతికొస్తుందని రైతు చెప్పారు.

టమాటాలో తెగుళ్లు నివారిస్తే అధిక దిగుబడి

చిట్కా

టమాటా పంటలో తెగుళ్లను నివారిస్తే అధిక దిగుబడి పొందవచ్చని రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. జిల్లాలో 80 వేల ఎకరాల్లో టమాటా పంట సాగవుతోందన్నారు. సూది ముక్కు పురుగు కారణంగా కాయలపై నల్లటి మచ్చలు ఏర్పడి నాణ్యత దెబ్బతింటుందన్నారు. ఈ పురుగుల నివారణకు ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. వాటితోపాటు కొరాజిన్ 1.5 మి.లీ, ఎమామెక్టిన్ బెంజోయేట్ 5గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. - బుక్కరాయసముద్రం

'ఏఎన్ఎంలపై వివక్ష తగదు'



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏఎన్ఎం, ఏఐటీయూసీ నాయకులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: గ్రామ వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్ఎంలను రెండు శాఖల పరిధిలో ఉంచడం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి విమర్శించారు. సోమవారం రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా కలెక్టరేట్ ఎదుట ఏఎన్ఎంలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయ ఉద్యోగులకు మంచి చేస్తామని హామీ ఇచ్చింది. ఈ ప్రకారమే కొన్ని కేడర్లను ఇప్పటికే నిర్దేశిత శాఖల్లో విలీనం చేశారు. ఆరోగ్య శాఖ పరిధిలో ఏఎన్ఎంలను పూర్తిగా విలీనం చేయకుండా రెండు శాఖల్లో ఉంచడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. స్టాఫ్‌నర్సు ఉద్యోగాల పదోన్నతికి ఏఎన్ఎంలకే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నిరసనలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, ఏఎన్ఎం ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీ, నాయకులు విజయ భారతి, తైరాబాను, పద్మావతి, జయలక్ష్మి, మంజుల, సావిత్రి, తదితరులు మాట్లాడారు. అనంతరం జేసీకి వినతి అందజేశారు.

ఆబ్కారీ పోలీసుల బదిలీ

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: మద్య నిషేధ, ఆబ్కారీ(ప్రొహిబిషన్, ఎక్సైజ్) శాఖలో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను బదిలీలు చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లాలో 58మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 36 మంది హెడ్‌కానిస్టేబుళ్లు.. అనంతలో 112 మంది, సత్యసాయిలో 69 మంది కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. వీరిని ఎక్సైజ్ స్టేషన్లకు, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలకు నియమించారు.

భక్తాంజనేయస్వామి విగ్రహం చోరీ

పామిడి, న్యూస్‌టుడే : పామిడిలోని పెన్నానది ఒడ్డున ఉన్న శ్రీసీతా రామాంజనేయస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న శ్రీభక్తాంజనేయ స్వామి విగ్రహం చోరీకి గురైంది. ఆలయధర్మకర్త షణ్ముఖకుమార్ ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ 1938లో నిర్మించిన పురాతన దేవాలయానికి చెందిన మూలవిరాట్ శ్రీభక్తాంజనేయస్వామి రాతి విగ్రహం ఉన్న గుడి తలుపులను పగులగొట్టి ఆదివారం రాత్రి విగ్రహాన్ని ఎత్తుకెళ్లారన్నారు. ఈఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

పిడుగుపాటుకు మహిళ దుర్మరణం



గంగమ్మ

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయ పనులకు వెళ్లిన కూలీ పిడుగుపాటుకు గురై మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని చదం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా.. కొందరు కూలీలతో కలసి రైతు రామకృష్ణారెడ్డి వ్యవసాయ పొలంలో కూలీ పనులకు వెళ్లారు. వర్షం కురవడంతో సమీపంలోని చెట్టు కిందకు చేరారు. ఒక్కసారిగా పిడుగుపడటంతో హెచ్.గంగమ్మ (58) అక్కడికక్కడే మృతిచెందగా, మరో కూలీ చిట్టెమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. తహసీల్దార్ నాగరాజు బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండలంలోని 74 ఉడేగోళం గ్రామానికి చెందిన రైతు పాలయ్యకు చెందిన కాడెద్దు పిడుగుపాటుకు గురై మృతిచెందింది.

ఐదేళ్లుగా భవన నిర్మాణ రంగం కుదేలు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ అస్తవ్యస్త పాలనతో భవన నిర్మాణ రంగం కుదేలై.. సంక్షేమ బోర్డు నిర్వీర్యంగా మారడంతో కార్మికులు అష్టకష్టాల పాలయ్యారని భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్రాధ్యక్షుడు ఎన్.రమణరావు ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక శ్రీలక్ష్మీ వేంకటేశ్వర కల్యాణ మండపంలో పెనుకొండ నియోజకవర్గంలోని భవన నిర్మాణ కార్మికుల సమావేశాన్ని సంఘం నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివతో కలసి ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు జిల్లాలో లక్ష మందికిపైగా ఉండగా రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మంది ఉన్నట్లు చెప్పారు. జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లలో ఇసుకను సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా చేయడంతో నిర్మాణ రంగం ఎక్కడికక్కడ స్తంభించిపోయి, లక్షలాది కార్మికులు ఉపాధి కరవై పొట్ట చేతపట్టుకొని బెంగళూరు, చెన్నై వంటి నగరాలు, ఇతర పట్టణాలకు వలసలు వెళ్లి అనేక అవస్థలు పడ్డారని వారు విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు దాటినా ఇచ్చిన హామీలు సరిగా అమలు చేయక పోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి లేబర్ కార్డులు అందించి, సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని రాష్ట్ర అధ్యక్షుడు డిమాండ్ చేశారు. ఈ హామీల అమలు కోసం ఈనెల 4వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు హనుమయ్య, రామకృష్ణ, రంగప్ప, ఆంజనేయులు, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.


అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య



నాగేంద్ర

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: అప్పులు తీర్చలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మండలంలోని మేడాపురం గ్రామానికి చెందిన భోగరాతి నాగేంద్ర (38) మూడెకరాల్లో పంటల సాగుకు పలువురి వద్ద అప్పులు చేశారు. భూగర్భ జలాలు అడుగంటడంతో నాలుగు బోర్లు వేయించారు. బోర్ల తవ్వకం, పంటల సాగు కోసం చేసిన అప్పులు దాదాపు రూ.7లక్షలకు చేరాయి. వాటిని ఎలా తీర్చాలని మదనపడేవారు. ఆదివారం సాయంత్రం పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. కుటుంబ సభ్యులు, స్థానికులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆయనకు భార్య మౌనిక, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైలు కిందపడి కూలీ బలవన్మరణం



గురుస్వామి

తాడిపత్రి: తాడిపత్రి మండలంలోని చల్లవారిపల్లి గ్రామ సమీపంలో రైలుకింద పడి కూలీ ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం తెల్లవారుజామును జరిగింది. రైల్వే ఎస్సై నాగప్ప తెలిపిన వివరాల మేరకు నందలపాడుకు చెందిన గురుస్వామి(40) కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. కొంత కాలంగా మద్యానికి బానిసవ్వడంతో అనారోగ్య పాలయ్యాడు. గురుస్వామి తీవ్ర మనస్థాపానికి గురై రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడికి భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

చట్టాలపై అవగాహన అవసరం

లేపాక్షి, న్యూస్‌టుడే: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హిందూపురం డీఎస్పీ మహేష్ తెలిపారు. స్థానిక ఎస్సీ కాలనీలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా కులవివక్ష ఉంటే, పౌరహక్కులకు భంగం కలిగినట్లైతే వెంటనే పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. పలు రకాల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సమావేశంలో సర్పంచి ఆదినారాయణ, గ్రామీణ మండల సీఐ జనార్దన్, ఎస్సై నరేంద్ర, ఆర్‌ఐ ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ మహేష్

వివిధ శాఖల్లో అధికారులు బాధ్యతల స్వీకరణ

పెనుకొండ, హిందూపురం, అగళి, రొద్దం, న్యూస్‌టుడే: పెనుకొండ, హిందూపురం నియోజకవర్గాల్లో సోమవారం వివిధ శాఖల అధికారులు బాధ్యతలు చేపట్టారు. పెనుకొండ ఆర్డీవోగా టి.ఆనంద్‌కుమార్, ఎక్సైజ్ సీఐగా సృజన్‌బాబు, ఎస్సైగా వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. హిందూపురం ఒకటో పట్టణ ఎస్సైగా శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. రొద్దం ఎస్సైగా కె.నరేంద్ర, అగళి ఎంపీడీవోగా యాదవేంద్ర బాధ్యతలు స్వీకరించారు. అన్ని మయ్య జిల్లా కదిరమోచర్లపల్లి మండలం నుంచి బదిలీపై వచ్చారు. వీరిని ఆయాశాఖల సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

పాతనేరస్థులు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

గోరంట్ల, న్యూస్‌టుడే: మండలంలోని పాతనేరస్థులు, రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ రత్న స్థానిక పోలీసు సిబ్బందిని ఆదేశించారు. మండలంలో సోమవారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఎస్పీ చివరలో స్థానిక పోలీసుస్టేషన్ను సందర్శించారు. ఈసందర్భంగా నేరాల నియంత్రణపై దృష్టిసారించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డుప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సీఐ శేఖర్ అన్ని విషయాలు వివరించారు. ఎస్పీ మండల పర్యటనలో భాగంగా దిగువగంగంపల్లితండాలో పిడుగుపడి మృతిచెందిన దంపతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యం

పెనుకొండ: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకొని క్రమశిక్షణ, దేశభక్తి, సేవాదృక్పథంతో మెలగుతూ లక్ష్యాలను చేరుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించి విద్యార్థులకు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కేసుదర్శన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర 2047పై సమావేశం

గోరంట్ల, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో భాగంగా 2024-29 మధ్య అయిదేళ్లలో చేపట్టాల్సిన అభివృద్ధి ప్రణాళికలు తయారీపై చర్చించడానికి స్థానిక మండల పరిషత్తు సమావేశ హాలులో ఎంపీడీవో రఘునాథగుప్త ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో ఆదేశించారు. పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, తహసీల్దార్ మారుతి, వివిధ శాఖల మండలస్థాయి అధికారులు హాజరయ్యారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

హిందూపురం అర్బన్: సడ్లపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి సోమవారం బసవనపల్లికి చెందిన రామిరెడ్డి కుమారుడు ఏఆర్ శ్రీనివాసరెడ్డి రూ.50వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

వరద బాధితులకు సాయం

పరిగి, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థమై పరిగికి చెందిన ఇటుకబట్టీల నిర్వాహకులు సోమవారం రాత్రి పెనుకొండలోని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఇంటికి వెళ్లి రూ.50వేల నగదు అందజేశారు.

చిరు వ్యాపారులకు ఎస్సై హెచ్చరిక

సోమందేపల్లి: స్థానిక వాల్మీకి కూడలిలో మద్యం దుకాణం ఎదుట తోపుడు బండ్లపై బజ్జీలు, వేరుసెనగ కాయలు విక్రయించే ఇద్దరు మహిళలు తరచూ గొడవ పడుతున్నారని, వీరితో ఇబ్బందిగా ఉందని స్థానికులు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం ఎస్సై రమేష్‌బాబు, హెచ్‌సీ సుదాకర్, సిబ్బందితో కలసి అక్కడికి చేరుకొని ఇరువురిని హెచ్చరించారు. ఇకమీదట తోపుడు బండ్లను ఎవరు ఇక్కడ పెట్టినా చర్యలు చేపడతామని చెప్పారు.

మండల సమాఖ్య ఎన్నిక

మడకశిర గ్రామీణం: చైతన్య మండల సమాఖ్య నూతన పాలకవర్గాన్ని సోమవారం మడకశిరలో ఎన్నుకున్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలిగా మహాలక్ష్మిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలు, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, కోశాధికారి మొదలగు పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు.

తాగునీటి నివారణకు అడుగులు

• నియోజకవర్గ వ్యాప్తంగా బోర్ల తవ్వకాలకు చర్యలు


మడకశిర మండలం ఎగువ రామగిరిలో తవ్వించిన బోరులో పుష్కలంగా వస్తున్న నీరు

మడకశిర, న్యూస్‌టుడే: జిల్లాలోనే చిట్ట చివరన సముద్ర మట్టానికి 2వేల అడుగుల ఎత్తులో ఉన్న మడకశిరలో తీవ్రమైన తాగునీటి సమస్య ఉంది. వెయ్యి నుంచి 1200 అడుగులు తవ్వినా నీరు లభించని పరిస్థితి. నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలో తీవ్రమైన తాగునీటి సమస్యను అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి బోర్ల తవ్వకం చేపట్టారు. తవ్వించిన బోర్లలో సైతం పుష్కలంగా నీరు లభించడంతో గ్రామాల్లో సమస్య పరిష్కారం మైంది.

నెల రోజుల్లో 20 చోట్ల..

శాశ్వతంగా తాగునీటి సమస్యను తీర్చేందుకు స్థానిక ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కలిసి ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా 60 బోర్లు తవ్వించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే రెండు నెలల్లో 5 మండలాల పరిధిలో 19, నగర పంచాయతీలో ఒక బోరు వేశారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తే గ్రామాలే లక్ష్యంగా చేసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.

● మడకశిర మండలంలోని ఎగువ రామగిరి, వైబీహళ్లి, ఎఆర్‌రొప్పం, టీడీపల్లి, అచ్చంపల్లి, చందకచర్ల గ్రామాల్లో బోర్లు వేయించగా మంచి నీరు లభించాయి. ప్రస్తుతం వాటికి మోటర్లు, పంపుసెట్లు బిగించి ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. గొడనహళ్లి గ్రామంలో ఎమ్మెల్యే సొంత నిధులతో బోరు తవ్వించారు.

● రొళ్ల మండలంలోని కొడగారిగుట్టలో 8ఏళ్లుగా తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బోరు తవ్వించగా నీటి సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● గుడిబండ మండలం బూదిపల్లి, కేకాతి, జవనదుడు, దిగువర్తి గ్రామాల్లో బోర్లు తవ్వించారు.

రూ.3.75 కోట్లతో ప్రతిపాదనలు

నియోజకవర్గంలో శాశ్వత తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.3.75కోట్లు ప్రతిపాదనలు పంపించారు. ఇందులో బోర్ల తవ్వకం, విద్యుత్తు కనెక్షన్లు, మోటార్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నారు. అదే విధంగా రూ.64లక్షలతో రక్షిత తాగునీటి పథకాలకు 16 నియంత్రికలు మంజూరు చేయాల్సి ఉంది.

అందరికీ సరఫరా చేయడానికి పనులు

- మనునాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, మడకశిర

ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య తీర్చడానికి చర్యలు తీసుకుంటున్నాం. వీటితో పాటు రూ.5లక్షల లోపు ఉన్న జలజీవన్ మిషన్ ద్వారా మంజూరైన పనులకు టెండర్లు పిలిచి వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే తెలియజేశారు. ప్రణాళిక ప్రకారం వచ్చే వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూస్తాం.

మేము న్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: నారనాగేపల్లి పొలాల్లో 11కేవీ స్తంభాలు నేలకొరిగాయి. -గోవిందప్ప
సమాధానం: పరిశీలించి మరమ్మతు చేస్తాం. -శ్రీనివాసమూర్తి, ఏఈ, రొద్దం

సమస్య: సుబ్బరాయప్పకొట్టాల రహదారి గుంతలుగా మారింది. -ముత్యాలప్ప
సమాధానం: ప్రతిపాదనలు పంపించాం. -రాబర్ట్‌విల్సన్, ఎంపీడీవో, రొద్దం -న్యూస్‌టుడే, రొద్దం

సమస్య: ఎన్‌ఆర్‌రొప్పంలో తాగునీటి సమస్య ఉంది. -చంద్రశేఖర్
సమాధానం: వెంటనే పరిష్కరిస్తాం. -లక్ష్మీనారాయణ, సర్పంచి, రాళ్లపల్లి

సమస్య: కేకేపాళ్యం ఇందిరమ్మ కాలనీలో ఇళ్లపై విద్యుత్తు తీగలు ఉన్నాయి. మార్చగలరు. -చంద్రశేఖర్
సమాధానం: విద్యుత్తు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. -రామారావు, ఎంపీడీఓ, గుడిబండ -న్యూస్‌టుడే, గుడిబండ

పురుషుల ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

హిందూపురం, న్యూస్‌టుడే: స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో సోమవారం సీనియర్ ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించి నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు జేపీ అనిల్‌కుమార్ తెలిపారు. తాలుకా 30 మంది క్రీడాకారులను ప్రాబబుల్స్ ఎంపిక చేయగా అనంతరం టీమ్ క్యాంపు నిర్వహించి తుది జట్టు ఎంపిక చేశామన్నారు. వీరిని త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి జట్టుకు పంపుతున్నట్లు వివరించారు. పోటీల్లో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్షాద్‌అలీ, కార్యదర్శి బీకే మహ్మద్‌సలీమ్, కోశాధికారి ఎస్.శేఖర్, కోచ్‌లు రామచంద్ర, చైతన్య పాల్గొన్నారు.


జట్టుతో సంఘం జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి తదితరులు

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం: మంత్రి

గోరంట్ల, న్యూస్‌టుడే: ప్రకృతి ప్రకోపం కారణంగా కుటుంబం చిన్నాభిన్నం కావడం దురదృష్టకరం.. ప్రభుత్వం నుంచి అన్నివిధాలా ఆదుకుంటామని గోరంట్ల మండలంలోని దిగువగంగంపల్లితండాలో ఆదివారం పిడుగు పడి దంపతులు మృతి చెందిన కుటుంబానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. మృతుడు దసరా నాయక్ తల్లి, కుమారుడు జగదీష్‌నాయక్‌తో మాట్లాడి వర్షాకాలంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సంఘటనపై ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి చెందారని తెలిపారు. మృతులు ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున, ఒక్కో పాడి ఆవుకు రూ.37,500 ప్రకారం మొత్తం రూ.8,70,000 చెక్కును జగదీష్‌నాయక్‌కు అందజేశారు. ప్రమాదం సందర్భంగా శరీరంపై ఏర్పడిన గాయాలను బాధితుడు మంత్రికి చూపించారు. భవిష్యత్తులో అవసరమైన మేరకు సాయం అందిస్తామని పేర్కొన్నారు. మృతుల చిత్రపటాలకి పూలమాలవేసి నివాళులర్పించారు. పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ, పెనుకొండ డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ మారుతి, సీఐ శేఖర్, ఆ పంచాయతీ నాయకులు రామస్వామి, రుద్ర, చక్రేనాయక్, రామస్వామినాయక్, హరిదత్త, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న మంత్రి సవిత

సాంఘిక దురాచారాలు, అసమానతలు తొలగాలి

గోరంట్ల, న్యూస్‌టుడే: మనుష్యుల మధ్య అసమానతలు తొలగాలని, సామాజిక దురాచారాలు రూపుమాపాలని ప్రభుత్వం పౌరహక్కుల దినోత్సవాలను నిర్వహిస్తోందని జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. గోరంట్ల మండలంలోని వానవోలు గ్రామ దళితవాడలో సోమవారం ఏర్పాటుచేసిన పౌరహక్కుల దినోత్సవంలో ఎస్పీ పాల్గొని ప్రసంగించారు. దేశపౌరులుగా ప్రతిఒక్కరికి భారత రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎట్టిపరిస్థితుల్లో భంగం కలగరాదన్నారు. స్వాతంత్య్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా ఇప్పటికీ అక్కడక్కడ అసమానతలు కనిపిస్తుండడం బాధాకరమన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమని అవగాహన కల్పించడానికే ఈసమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. నిరక్షరాస్యత, పేదరికం తొలగినపుడే అందరూ సమానం అనే భావన వస్తుందన్నారు. పిల్లలను బాగా చదివించుకోవడమే ప్రధాన సూత్రమన్నారు. గ్రామంలోని దళితుల పట్ల ఇప్పటికీ వివక్ష కొనసాగుతోందని పలువురు ఈసందర్భంగా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా రెండుగ్లాసుల పద్ధతి, సెలూన్‌షాపుల్లో దళితులకు కటింగ్ చేయకపోవడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన ఎస్పీ మూడునెలల్లో ఈ రెండు విధానాల్లో మార్పు వచ్చేందుకు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ దళితవాడ పర్యటించి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. స్థానిక తహసీల్దార్ మారుతి, ఎంపీడీవో రఘునాథగుప్త, సీఐ శేఖర్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రత్న

కార్యకర్తల సంక్షేమానికి తెదేపా కృషి

మడకశిర, న్యూస్‌టుడే: గ్రామ స్థాయి నుంచి పార్టీని కాపాడే ప్రతి కార్యకర్త అభివృద్ధికి తెదేపా కట్టుబడి ఉంటుందని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో సోమవారం పార్టీ సభ్యత్వ నమోదుపై క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసిన ఏకైక పార్టీ తెదేపా అన్నారు. రూ.100తో సభ్యత్వం తీసుకుంటే ప్రమాద బీమాగా కార్యకర్త కుటుంబానికి అండగా రూ.2లక్షలు ఉంటుందన్నారు. 2024 ఎన్నికల్లో గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. గ్రామాల్లో తెదేపా సభ్యత్వ నమోదును అక్టోబరు 2 నుంచి ప్రారంభించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు భక్తర్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, పట్టణ, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు

కౌన్సిల్ సమావేశం వాయిదా

పెనుకొండ, న్యూస్‌టుడే: స్థానిక నగరపంచాయతీ అత్యవసర కౌన్సిల్ సమావేశం నాటకీయ పరిణామాల మధ్య వాయిదా పడింది. సోమవారం ఉదయం 11గంటలకు అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు అన్నీ సిద్ధం చేశారు. అనుకోకుండా మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభిస్తామనడంతో ఛైర్మన్ ఉమర్‌ఫరూక్‌ఖాన్, వైస్‌ఛైర్మన్ సునీల్‌కుమార్ సహా పలువురు కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. కమిషనర్ శ్రీనివాసులు, సిబ్బంది గైర్హాజరవడంతో 4గంటల వరకు వేచి చూసి సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. అందరూ వెళ్లిపోయిన తరువాత బాలుస్వాంక్ సైతం సమావేశం నిర్వహించే గదిని తాళం వేశారు. ఈవిషయంపై కమిషనర్ శ్రీనివాసులును వివరణ కోరగా అనివార్యకారణాల వల్ల మంత్రిగారి ఆదేశాల మేరకు కౌన్సిల్ సమావేశం వాయిదా వేసినట్లు ఆయన వివరించారు.

సమాజ శ్రేయస్సే బ్రహ్మకుమారీల ధ్యేయం

హిందూపురం, న్యూస్‌టుడే: బ్రహ్మకుమారీలు సమాజ శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తారని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎన్‌ఎస్‌పీఆర్ రోడ్డులోని వాసవీ ధర్మశాలలో స్థానిక సత్యనారాయణపేటలో ఉన్న ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'మానవుడు నైతిక విలువలను ఎలా పొందాలి.. పరమాత్ముడిని ఏవిధంగా స్మరించాలి.. భగవద్గీతను ఏవిధంగా పఠించాలి' అన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ హాజరై మాట్లాడారు. బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వారు సమాజ శ్రేయస్సు, సంస్కృతి, సంప్రదాయాల కోసం నిరంతరం తపిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నారని, వారికి ఎల్లప్పుడు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్రం హుబ్లీ ఆధ్యాత్మిక గురువు బీకే వీణ, బ్రహ్మకుమారీ రీజనల్ డైరెక్టర్ సుగంధదేవి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జేపీకే రాము, ట్రెజరర్ రవీంద్రుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ఇల్లు చెట్టెక్కింది.. ప్రమాదం పొంచి ఉంది

పట్టణంలోని కోటలో ఉన్న రామచంద్రస్వామి దేవాలయం నుంచి బాస్కరపేటకు వెళ్లే రహదారి మధ్య ఓ ఇంటి ముందు భాగాన ఉన్న చెట్టు రోజురోజుకూ పెరుగుతూ తీగలను తాకుతోంది. ఎప్పుడైనా ప్రమాదం జరగవచ్చని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు శాఖ అధికారులు వెంటనే ఆ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



-న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్

7 కిలోమీటర్లు.. 420 గుంతలు



వై.డి.హళ్లి గేటు నుంచి హెచ్.డి.హళ్లి తండా హెమేదుగా దేవరహళ్లి, గాయత్రి కాలనీ, కర్ణాటక సరిహద్దు వరకు 7 కిలోమీటర్లున్న రహదారిపై ప్రయాణమంటే నరకయాతనే. తారురోడ్డంతా గుంతలమయం కావడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో 420 గుంతలు ఉన్నాయి. విద్యార్థులు, వృద్ధులు కంకరపై ప్రయాణించడం కష్టమైనదని మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిపాదనలు పంపించామని, మంజూరైన వెంటనే నిర్మిస్తామన్నారు. -న్యూస్‌టుడే, అగళి

మరమ్మతు చేస్తే నీరు

మరావరం మండలం వరస బాలుర వసతి గృహం ఆవరణలో గతంలో చేతిపంపు ఏర్పాటు చేశారు. ఐదారేళ్లుగా మరమ్మతు చేయకపోవడంతో బోరులో నీరున్నా నిరుపయోగంగా ఉంది. ఇదే గ్రామంలో నాలుగు చేతిపంపులు ఇలాగే వృథాగా ఉన్నాయి. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రత్యూష దృష్టికి తీసుకెళ్లగా ఉన్నతాధికారులతో మాట్లాడి మరమ్మతు చేయిస్తామన్నారు. -న్యూస్‌టుడే, అమరాపురం



త్రుటిలో తప్పిన ప్రమాదం



పెనుకొండ శివారులో 44వ జాతీయ రహదారిపై శ్రీకృష్ణదేవరాయల కూడలిలో ఓ భారీ కంటైనర్ ఎదురుగా వచ్చిన బస్సును తప్పించబోయి అపసవ్య దిశలో రోడ్డు మీదకు దూసుకెళ్లింది. ఆసమయంలో ఎదురుగా వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకొని ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా క్రేన్ సహాయంతో కంటైనర్‌ను పక్కకు జరిపించారు.

-న్యూస్‌టుడే, పెనుకొండ

ఈఎస్ఐ వైద్యుల పోస్టులు భర్తీ చేయాలి

హిందూపురం, న్యూస్‌టుడే: స్థానిక ఈఎస్ఐ ఆసుపత్రిలో సుదీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ర్యాలీగా వెళ్లి ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా హిందూపురం, కొట్నూరు ఈఎస్ఐ డిస్పెన్సరీలు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయని, వీటి కింద వేలాది మంది కార్మికులు ఉన్నప్పటికీ వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కార్యాలయం గుమస్తాకు వినతిపత్రం అందించారు. జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, జిల్లా కోశాధికారి డి.బాబు, పట్టణ కార్యదర్శి మారుతిరెడ్డి, ఉపాధ్యక్షులు సమీవుల్లా, కమల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ కార్మికులు

వారపు సంత..

◆ కూరగాయలు కొనలేమంటున్న జనం

ధరల మోత

పెనుకొండ, న్యూస్‌టుడే: కూరగాయల ధరలు వర్షాకాలమైనా పెరిగిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏం తినాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారానికి కూరగాయల కోసం రూ.500 ఖర్చుచేసినా ఓ చిన్న కుటుంబానికి సరిపడా కూరగాయలు అందటం లేదని వ్యక్తం చేస్తున్నారు. వారపు సంతలో పావుకిలో రూ.20కి తక్కువ ఏకూరగాయలు లేవని, కనీసం కొత్తిమీర కట్ట కొనాలన్నా రూ.20 పలుకుతోందని వాపోతున్నారు. నియోజకవర్గంలో కూరగాయల సాగు తగ్గిపోవడంతో ధరలు పెరిగిపోయాయి. కర్ణాటకలోని బాగేపల్లి నుంచి కూరగాయలు వస్తే కొద్దిగా ధరలు తక్కువగా ఉంటాయని వ్యాపారులు అంటున్నారు.

వ్యాపారం అంతంత మాత్రమే

ఇటీవల ధరలు అమాంతం పెరగడంతో రోజువారీగా కూరగాయల వ్యాపారం కూడా అంతంతమాత్రంగానే ఉంటోంది. ధరలు మధ్యస్థంగా ఉంటే రోజుకు రూ.4వేల నుంచి రూ.5వేల వ్యాపారం అవుతుండేది. ప్రస్తుతం ధరలు పెరగడంతో సగం కూడా వ్యాపారం కావడం లేదని వ్యాపారస్తులు అంటున్నారు. కొత్తిమీర, మెంతికూర, పాలకూర, పుదీన కట్ట నాణ్యతను బట్టి రూ.15నుంచి రూ.20కి విక్రయిస్తున్నారు. గోంగూర, పాలకూర, నేతకూరలు కట్ట రూ.10కి విక్రయిస్తున్నారు.

కూరగాయలు	గతనెలలో (కిలో ధర రూ.లలో)	ప్రస్తుతం
వెల్లుల్లి	200	400
ఉల్లిపాయలు	30	60
టమాట	30	60
బీరకాయ	30	60
బెండకాయ	30	60
చిక్కుడు	30	60
క్యారెట్	40	80
బీన్స్	40	80
బీట్‌రూట్	30	60
ఆలు	20	40
క్యాబేజీ	30	50
అల్లం	60	100


పెనుకొండలో వారపు సంతలో కూరగాయల దుకాణంలో కొనుగోలు చేస్తున్న స్థానికులు

రూ.500లు వారానికి సరిపోదు

రామాంజినేయులు, అడదాకులపల్లి: భవన నిర్మాణ పనులకు కూలికెళితే రోజుకి రూ.500వస్తుంది. ప్రతిరోజు పనిదొరకదు. గతంలో రూ.500లతో వారానికి సరిపడా కూరగాయలు సంచినిండా వచ్చేవి. ప్రస్తుతం ధరలు పెరగడంతో చాలడం లేదు. ఇంట్లో నాతో పాటు భార్య, ఇద్దరు పిల్లలు న్నారు. ధరలు పెరగడంతో కూరలు కొనలేకపోతున్నాం. ప్రభుత్వం ధరలు నియంత్రణ చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలి.

అసంపూర్తిగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు

● కాలనీలో మౌలిక వసతుల కరవు

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే: కొడిగెనహళ్లిలోని జగనన్న కాలనీలో చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కాలనీలో మొత్తం 313 మంజూరయ్యాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు నిధులు కేటాయించింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అట్టహాసంగా ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. కొడిగెనహళ్లిలో 1, 2 జగనన్న కాలనీలు ఉన్నాయి. ప్రస్తుతం ఆయా కాలనీల్లో కొందరు లబ్ధిదారులు గృహాలను పూర్తి స్థాయిలో నిర్మించుకోగా సగానికి సగం ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి. మరికొన్ని పునాది దశలో ఉన్నాయి. కాలనీ ఏర్పాటు సమయంలో అధికారులు మౌలిక వసతులైన తాగునీటి జలజీవన్ మిషన్ పథకం కింద రక్షిత మంచినీరు అందిస్తామని, పైప్‌లైన్ వేసి సగం ఇళ్లకు ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. అయితే మిగిలిన ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేయలేదు. అంతర్గతంగా సిమెంట్ రహదారులు ఏర్పాటు చేయాల్సి ఉంది.


పునాదిపై మట్టి నింపుతున్న లబ్ధిదారుడు

నీటి సమస్యతో ఇబ్బందులు



మా కాలనీలో రెండు వీధులకు పైప్‌లైన్ వేశారు. ప్రస్తుతం నేను పునాది దశ వరకు నిర్మాణం చేపట్టాను. నీటిని కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకోవాలంటే ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు కాలనీ మెట్టానికి నీటి సరఫరా చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలి. -సతీష్, లబ్ధిదారుడు

మార్చి 31లో పూర్తయ్యేలా కృషి చేస్తాం

ఇందిరమ్మ కాలనీలో అసంపూర్తిగా ఉన్న పక్కాగృహాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. టాప్‌లెవెల్ వరకు వచ్చి ఆగిపోయిన గృహాలు అక్టోబరు 31 లోపు పూర్తి చేస్తాం. పునాది దశలో ఉన్నవి మార్చి 31 లోపు పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించాం. -సునీత, హౌసింగ్ ఏఈ

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు



పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్న టింబక్టు కలెక్టివ్ అధికారులు

సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపాలి

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: సేంద్రియ వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపాలని టింబక్టు కలెక్టివ్ సంస్థ రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ మేనేజర్ పేరూరి శ్రీకాంత్ తెలిపారు. సోమవారం మండలంలోని గువ్వలగొంది గ్రామంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌లు రవి, సన్నప్పయ్య, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గరుడంపల్లిలో ఏళ్ల తరబడి ప్రభుత్వ అసైన్డ్ భూమిలో కొందరు రైతులు పశువుల షెడ్డు, దొడ్లు వేసుకుంటున్నారని, దాన్ని కొందరు ఆక్రమణ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న ఆరోపించారు. సోమవారం భూ ఆక్రమణపై గ్రామస్థులతో కలిసి ధర్మవరం ఆర్డీవో వెంకటశివరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. గ్రామంలో 593-10 సర్వేనంబరులో 4.45 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దాన్ని కొందరు గ్రామస్థులు 50, 60 సంవత్సరాలుగా వినియోగించుకుంటున్నారని తెలిపారు. కానీ, గ్రామానికి చెందిన నారాయణస్వామి అనేవ్యక్తి ఈ భూమి తనపేరిట రిజిస్ట్రేషన్ అయిందని, వెంటనే ఖాళీ చేయాలని బెదిరిస్తున్నాడని తెలిపారు. దీనిపై విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ధర్మవరం ఆర్డీవో బాధ్యతల స్వీకరణ

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం ఆర్డీవోగా మహేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఆర్డీవోగా పనిచేస్తున్న వెంకటశివరామిరెడ్డి బదిలీ అయ్యారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న మహేష్‌ను ధర్మవరం ఆర్డీవోగా నియమించారు. నూతన ఆర్డీవోకు వెంకటశివరామిరెడ్డి బాధ్యతలు అప్పగించారు. నూతన ఆర్డీవో మాట్లాడుతూ 2022లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎన్నికైనట్లు చెప్పారు.

ఉప తహసీల్దార్‌గా నారాయణస్వామి

ముదిగుబ్బ: మండల ఉప తహసీల్దార్‌గా నారాయణస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న సరస్వతి కర్నూల్‌కు బదిలీ అయ్యారు. సీఎస్ డీటీ మునిస్వామి ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. ఉన్నతాధికారులు రెగ్యులర్ ఉప తహసీల్దార్‌గా నారాయణస్వామిని నియమించారు.

ప్రొహిబిషన్ సీఐగా ఫరుఖ్‌జమ్

చెన్నేకొత్తపల్లి: చెన్నేకొత్తపల్లి ప్రొహిబిషన్ సీఐగా ఫరుఖ్‌జమ్ సోమవారం ఎక్సైజ్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

నల్లచెరువు ఎస్సైగా మక్బూల్‌బాషా

నల్లచెరువు (కదిరి): నల్లచెరువు నూతన ఎస్సైగా మక్బూల్‌బాషా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై లింగన్న బదిలీపై వెళ్లడంతో ఖాళీ ఏర్పడింది. దీంతో మగ్బూల్‌బాషా బదిలీపై వచ్చారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. పలువురు అభినందనలు తెలిపారు.

ఎన్పీకుంటకు వలిబాషా..

నంబులపూలకుంట(గాండ్లపెంట): ఎన్పీ కుంట మండలం ఎస్ఐగా వలిబాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రొద్దం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ శ్రీధర్ హిందూపురానికి వెళ్లారు. గ్రామాల్లో పర్యటించి సమస్యలు లేకుండా శాంతి భద్రతలు పర్యవేక్షిస్తానని తెలిపారు.

'విద్యార్థి సంఘాలపై ఆరోపణలు సరికాదు'

ధర్మవరం పట్టణం: పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు ఫీజుల పేరిట విద్యార్థుల తల్లితండ్రుల నుంచి భారీగా నగదు వసూలు చేసుకుంటున్నాయని, వారు చేస్తున్న దందాలను ప్రశ్నిస్తుంటే విద్యార్థి సంఘాలపై ఆరోపణలు చేయడం సరికాదని విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్ పురుషోత్తం విమర్శించారు. సోమవారం విద్యార్థి సంఘాలు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నంబరు 1, 41 ప్రకారం నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలో విద్యాశాఖాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు పోతులయ్య, ప్రసాద్, నాగార్జున, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

'భూమి ఆక్రమించారు న్యాయం చేయండి'

చెన్నేకొత్తపల్లి: సాగు చేసుకుంటున్న భూమిని ఓ ప్రైవేటు కంపెనీ వారు ఆక్రమించారని న్యామద్దెలకు చెందిన రైతు మంజునాథ్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తహసీల్దార్ సురేశ్‌కుమారికి వినతి పత్రం అందజేశారు. విచారించి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

80 ఏళ్ల వయసులో దయనీయం

పింఛను దూరం.. ఆకలి పోరాటం

అర్హులైనా అందని సామాజిక భద్రత సాయం

కదిరి, కొత్తచెరువు, ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: వృద్ధాప్యంలో సామాజిక భద్రత పింఛను జీవన ఆధారం. కుటుంబానికి భారమవకుండా గౌరవంతో బతికేలా ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తోంది. తద్వారా లక్షలాది వృద్ధులు ఎవరి దయాదాక్షిణ్యం లేకుండా హాయిగా బతికేలా ఆదుకుంటోంది. అయితే అర్హత కలిగిన ఎందరో పింఛను అందక ఆశతో ఎదురు చూస్తున్నారు. ఆధార్, బియ్యం కార్డు, దరఖాస్తు చేయడం తెలియనివారితో పాటు గ్రామ రాజకీయాలతో చాలా మంది లబ్ధి పొందలేకున్నారు. ఫలితంగా బతుకు భారంగా నెట్టుకొస్తున్నారు. అర్హత ధ్రువీకరణకు బియ్యం కార్డు, ఆధార్ లాంటి సమస్యలను పరిష్కరించి పింఛను అందించి ఆదుకోవాలని అర్హులైన వృద్ధులు వేడుకుంటున్నారు.

కొత్తచెరువులో తన కంటూ ఎవరూ లేని వృద్ధుడు **సిద్ధయ్య** ఆస్తిపాస్తుల్లేవు. చివరకు బియ్యం కార్డు కూడా లేదు. ఊరి చివరన సత్రంలో బిక్కుబిక్కుమంటూ ఒంటరి జీవితం గడుపుతున్నారు. గతంలో 'ఊరి చివరన.. నరక యాతన' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంతో స్పందించిన అధికారులు ఆధార్ కార్డు మంజూరు చేశారు. అంతటితో వదిలేశారు. జీవనానికి పనికొచ్చే బియ్యం కార్డు, పింఛను, గృహం లాంటివేవీ ఇవ్వలేదు. వృద్ధుడి భార్య, కుమారుడు కొన్నేళ్ల క్రితమే మృతి చెందారు. దీంతో 80 ఏళ్ల వయసులో తనకంటూ ఎవరూ లేక అనాథగా మిగిలాడు. ఎవరైనా దయతలచి ఇచ్చేసాయంతో వండుకుని తింటాడు. లేదంటే ఆకలితో పోరాటం తప్పడం లేదు. ఎంత కాలం బతుకుతానో తెలీదు. ప్రాణం ఉన్నప్పుడే అధికారులు దయతలచి బియ్యం కార్డు, పింఛను ఇవ్వాలని సిద్ధయ్య వేడుకుంటున్నాడు.



ఆదరణ కరవై.. అభద్రత చేరువై..

అమడగూరు మండలం తనకంటిపల్లికి చెందిన **ఆదెమ్మ**ది నిరుపేద కుటుంబం. జీవనాధారం లేని సంతానం కాయకష్టంతో ఎవరి బతుకు వాళ్లు చూసుకుంటున్నారు. భర్త వెంకటరమణ వలసపోయి చిన్నా, చితక పనులు చేసి తెచ్చిన సొమ్ముతో పోషణ జరిగేది. ఏడాదిన్నర కిందట కూలీ కెళ్లిన వ్యక్తి తిరిగిరాలేదు. దీంతో ఆదెమ్మ 66 ఏళ్ల వయసులో ఒంటరిగా కాలం వెళ్లదీస్తోంది. అనుకోకుండా కిందపడటంతో ఏర్పడిన నొప్పితో ఊతకర్ర సాయంతో నడక సాగిస్తోంది. రేషన్ కార్డుకు వచ్చే ఐదు కేజీల బియ్యం, ఊళ్లో వాళ్లు అందించే సాయంతో జీవనం సాగిస్తోంది. పింఛనుకు దరఖాస్తు చేసినా మంజూరవక నిరాశ మిగిలినట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇప్పటికైనా సామాజిక భద్రతా పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతోంది.



సామాజిక పరిజ్ఞానం అలవరచుకోవాలి

అమడగూరు, న్యూస్‌టుడే: బాలికలు విద్యతో పాటు సామాజిక పరిజ్ఞానం అలవరచుకోవాలని ఎంపీడీవో మునెప్ప, ఈవోఆర్డీ సనీమ బాలికలకు సూచించారు. గుండువారిపల్లిలోని కస్తూర్బా విద్యాలయంలో సోమవారం మన వ్యర్థాల నిర్వహణ, నీరు, గాలి, నేల కాలుష్యంపై వ్యాసరచన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన 10 మంది విద్యార్థినులకు అధికారులు బహుమతులు అందజేశారు. ఎస్‌వో వెంకటలక్ష్మమ్మ, ఎంఎస్‌వో ఆదినారాయణ, ఏపీఎం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



బాలికలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో మునెప్ప, ఈవోఆర్డీ సనీమ

స్వచ్ఛభారత్ కార్మికుల వేతనాలు చెల్లించాలని ఆందోళన

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు 6 నెలలుగా వేతనాలు మంజూరుకాక కుటుంబాల పోషణ భారంగా మారిందని సీఐటీయూ మండల అధ్యక్షుడు జేవీ రమణ పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ కార్మికులకు బకాయిపడిన వేతనాలు చెల్లించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో ఆందోళన చేపట్టారు. అంబేడ్కర్ కూడలిలో కార్మికులు మోకాళ్లపై నిలబడి గడ్డి తింటూ ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు అయూబ్‌ఖాన్, ఆదినారాయణ, కార్మిక మహిళా సంఘం నాయకురాలు నాగవేణి తదితరులు పాల్గొన్నారు.



మోకాళ్ల మీద నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

ఉద్యోగుల బకాయిలు చెల్లించండి

నంబులపూలకుంట(గాండ్లపెంట), న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉద్యోగుల సర్వీస్‌లో దాచుకున్న డబ్బులో పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ లోన్లు, ఆర్జిత సెలవుల నగదు చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తుందని విమర్శించారు. డీఏ, పీఆర్సీ బకాయిలను చెల్లించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిజిల్లా గౌరవాధ్యక్షుడు రామాంజనేయులు యాదవ్, జిల్లా కౌన్సిలర్ రమణనాయక్, శివయ్య, మురళి, సందీప్, గోవర్ధనరెడ్డి, రహీమ్, వెంకటరమణారెడ్డి, రామ్మోహన్, లాలుసాబ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఎస్టీయూ ఉపాధ్యాయులు

తుమ్మలబైలులో తాగునీటి సమస్య

గాండ్లపెంట, న్యూస్‌టుడే: తుమ్మలబైలు గ్రామంలో తాగునీటి పథకం బోరుబావులు పాడవడంతో తాగునీటి సమస్య నెలకొంది. గ్రామంలో ఉన్న బోరుబావి మోటార్లు కాలిపోవడంతో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అల్ప విద్యుత్తు వల్ల విద్యుత్తు మోటార్లు కాలిపోతున్నాయని గ్రామస్థులు తెలిపారు. పంచాయతీ అధికారులకు తెలపినా నిధులు లేవని పట్టించుకోవడలేదని వాపోతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి చేరేలా సామాజిక మాధ్యమంలో గ్రామానికి చెందిన మహేష్‌బాబు పోస్టు చేశాడు. ఈ విషయంపై గ్రానీస అధికారి కిరణ్ కుమారెడ్డిని వివరణ కోరగా చేతిబోర్లు మరమ్మతు చేయించి నీటిని అందిస్తున్నామని తెలిపారు. రెండ్రోజుల్లో బోరుబావుల మోటార్లు మరమ్మతు చేయిస్తామని వివరించారు.



గ్రామంలో పనిచేయని బోరుబావి

మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే ఉత్తమ భవిష్యత్తు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: యువత తమ భవిష్యత్తు బాగుండాలంటే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, నిర్దేశించుకున్న లక్ష్యాలను సులువుగా సాధించుకుంటారని ఏపీ మోడల్ కళాశాల ప్రిన్సిపల్ పద్మశ్రీ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా, అసాంఘిక కార్యక్రమాల నియంత్రణపై సోమవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీ మోడల్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు పద్మశ్రీ, ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ యువత మంచి అలవాట్లు పెంపొందించుకుంటే వారు కలలుకన్న బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చునని వివరించారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి గోపాల్‌నాయక్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ

బంగారు పతక విజేతకు అభినందనలు

ధర్మవరం పట్టణం: ఇటీవల తిరుపతి వెంకటేశ్వర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జూడో పోటీల్లో పట్టణానికి చెందిన అక్షయిని అనే విద్యార్థిని 23 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించింది. సోమవారం విద్యార్థినిని తెదేపా నాయకుడు సంధా రాఘవ నగదు పురస్కారం అందించి అభినందించారు. జూడోలో మరిన్ని పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాంగళ్య సిల్క్ అధినేత జింకా పురుషోత్తం, ఆదిత్య స్కూల్ కరస్పాండెంట్ జనార్దన్, జూడో కోచ్ అనాయత్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ ప్లంబర్స్ కాలనీలో నిర్మాణాల కూల్చివేత

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం వద్ద ఉన్న ఎలక్ట్రికల్ ప్లంబర్స్ కాలనీలో నిర్మాణాలను సోమవారం హిటాచీ యంత్రంతో కూల్చారు. ప్రధాన రహదారి పక్కన నిర్మాణంలో ఉన్న భవనాల తొలగింపు జరుగుతున్న విషయం ఎలక్ట్రికల్ ప్లంబర్స్ అసోసియేషన్ నాయకులకు తెలియడంతో అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. అప్పటికే కొన్ని నిర్మాణాలను కూల్చివేశారు. 1వ పట్టణ పోలీసులు అక్కడకు చేరుకొని నిర్మాణాలను తొలగిస్తున్న వారిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. భాజపా నాయకుడు సోము నిర్మాణాలు కూల్చి వేయించాడని ఎలక్ట్రికల్ ప్లంబర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సురేంద్ర 1వ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అసోసియేషన్‌లోని మరోవర్గం తమకు ఇళ్ల స్థలాలు కేటాయించకుండా అన్యాయం చేశారని, అనర్హులు, వైకాపా వర్గీయులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని ఎలక్ట్రీషియన్ గోవిందరాజులు ఆరోపించారు. సంఘటనా స్థలంలో ఇరువర్గాలను పోలీసులు అక్కడినుంచి పంపించేశారు.



లక్ష్మీచెన్నకేశవపురం వద్ద తొలగించిన నిర్మాణం

మనస్తాపంతో యువకుడి బలవన్మరణం

తనకల్లు, న్యూస్‌టుడే: వ్యసనాలకు బానిసైన కుమారుడిని తల్లిదండ్రులు మందలించడంతో భీమ్లానాయక్‌తండాకు చెందిన వెంకటరమణ నాయక్ (23) అనే యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం జరిగింది. ఎస్ఐ గోపి తెలిపిన వివరాల మేరకు.. నానునాయక్ కుమారుడు వెంకటరమణ నాయక్ కొద్దిరోజుల కిందట ఫోన్ పోగొట్టుకున్నాడు. తల్లిదండ్రులను అడగడంతో కొత్తఫోన్ కొనిచ్చారు. చెడు అలవాట్లకు బానిసైన యువకుడు దానిని తనఖా పెట్టిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపంతో విషయం తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు కదిరి వైద్యశాలకు అక్కడి నుంచి అనంతపురం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. తండ్రి నానునాయక్ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

సామాజిక మాధ్యమాల్లో మహిళ ఫొటోలపై ఫిర్యాదు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: సమీప బంధువైన మహిళ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వ్యక్తి, అతడికి సహకరించిన తండ్రిపై కదిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలు పోలీసులకు తెలిపిన మేరకు వివరాలు. ఇక్బాల్‌రోడ్డుకు చెందిన ఫైజాన్ దగ్గరి బంధువైన మహిళ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మహిళ భర్త నిలదీశారు. ఆగ్రహించిన ఫైజాన్, ఆయన తండ్రి అబ్దుల్‌వాహబ్ అతడిపై దాడికి యత్నించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టీ హోటల్‌లో చోరీ

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: మదనపల్లెరోడ్డులోని టీహోటల్ చోరీ జరిగినట్లు యజమాని శ్రీనివాసులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి పొద్దుపోయాక వెనుక వైపు నుంచి హోటల్‌లోకి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు రూ.60 వేలు నగదు, రూ.25 వేలు విలువైన సిగరెట్లను ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

అంకితభావంతో గుర్తింపు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ప్రజలకు నిజాయతీగా అంకితభావంతో సేవలందించినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని జేసీ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎన్నికల విభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన నాగరాజును డీఆర్ఓ కొండయ్య, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సర్వసాధారణమని, శేష జీవితం ఆనందంగా గడపాలన్నారు. 44 ఏళ్ల విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి పదవీ విరమణ చేయడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మైనుద్దీన్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కిందపడి ఆత్మహత్య

ధర్మవరం : రాప్తాడు రైల్వేగేటు వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని యువకుడు (24) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. యువకుడి మృతదేహం తల, మొండెం వేరుపడ్డాయి. ధర్మవరం రైల్వే పోలీసులకు సోమవారం సమాచారం అందడంతో హెడ్‌కానిస్టేబుల్ షణ్ముఖరెడ్డి వెళ్లి పరిశీలించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో వివరాలు తెలియరాలేదని తెలిపారు. ధర్మవరం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సిఫార్సు బదిలీలకు తెరలేపుతారా: ఏపీటీఎఫ్

కొత్తచెరువు: ఉపాధ్యాయుల్లో సిఫార్సు బదిలీలు చేయబోమని.. చంద్రబాబు తీసుకొచ్చిన కౌన్సిలింగ్ స్ఫూర్తిని నిలబెడతామని విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, చంద్ర, మాధవ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో వందల సంఖ్యలో సిఫార్సు బదిలీలు జరిగాయి. ఉపాధ్యాయులకు శాస్త్రీయ పద్ధతిలో జరిగే కౌన్సిలింగ్ ప్రక్రియను కాదని.. నాటి వైకాపా ప్రభుత్వం సిఫార్సులు, అక్రమ పద్ధతిలో బదిలీలకు తెరలేపింది. ఎన్నికలకు ముందు 650 బదిలీలు సిద్ధం చేయగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిలిచిపోయాయని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అనేక జిలాల్లో సిఫార్సు బదిలీలు చేయడానికి రంగం సిద్ధం చేస్తూ ఆయా జిల్లాల విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీచేయడం పట్ల ఏపీటీఎఫ్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తక్షణమే సిఫార్సు ప్రక్రియను నిలిపి కౌన్సిలింగ్ విధానంలోనే బదిలీలు చేపట్టాలని కోరారు.

బదిలీ ఉద్యోగులకు వీడ్కోలు

నల్లచెరువు (కదిరి), న్యూస్‌టుడే: నల్లచెరువులో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. నల్లచెరువు ఎంపీడీవో శకుంతల, తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐ అశోక్, కార్యదర్శి వసుంధరలతోపాటు మరికొంత మంది బదిలీ అయ్యారు. మండల అధ్యక్షుడు రమణారెడ్డి ఉద్యోగులను శాలువాలతో సన్మానించారు. వారి సేవలను అభినందించారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బాణాసంచా జప్తు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: తనకల్లు మండలం కొక్కంటిక్రాస్‌లో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బాణాసంచాను సోమవారం పోలీసులు జప్తు చేశారు. నిల్వ ఉంచిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బంగారు దుకాణంలో చోరీ

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో పవిత్ర జ్యువెలరీ దుకాణంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. సీఐ నరేంద్రారెడ్డికి బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. బంగారు దుకాణం నిర్వాహకుడు శ్రీరామాచారి రోజులాగానే ఆదివారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం దుకాణం తెరిచి చూడగా బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. పశు వైద్యశాల వెనుక వైపు ఉన్న ఎరువుల దుకాణం కిటికీకి ఉన్న గ్రిల్‌ను తొలగించి లోపలికి ప్రవేశించి అక్కడి నుంచి బంగారు దుకాణానికి సంబంధించిన గోడకు పెద్ద రంధ్రం చేసి ప్రవేశించినట్లు గుర్తించారు. దుండగులు 20 తులాల బంగారు ఆభరణాలతో పాటు, ఒక కిలో వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. వీటి విలువ రూ.19 లక్షలు ఉంటుందని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించింది.

దివ్యాంగులకు న్యాయమూర్తి చేయూత

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఎనుములపల్లి భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ సోమవారం ఆట వస్తువులు, స్టేషనరీ వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ ఇస్తే దివ్యాంగ విద్యార్థులు కూడా సాధారణ విద్యార్థులకు సమానంగా రాణిస్తారని, వారిని తక్కువ చూడకూడదని పేర్కొన్నారు. అనంతరం ఆయన వారి యోగక్షేమాలు తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు పద్మజ, రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆటవస్తువులు అందజేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రాకేష్



శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న జనసేన నాయకులు

లడ్డూ కల్తీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరస్వామి పవిత్ర లడ్డూను కల్తీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం జనసేన నాయకులు కదిరి శివాలయంలో దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేనాని పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా కదిరిలో పార్వతీపరమేశ్వరులకు పూజలు చేసినట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి భైరవప్రసాద్ తెలిపారు. వెంకటేశ్వరస్వామి లడ్డూను కల్తీచేసి అపచారానికి పాల్పడిన అప్పటి ఈవో, ఛైర్మన్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చలపతి, రవికుమార్, రమణ, శ్రీనివాసులు, ప్రతాప్, రాజారాం, రఘు, సరస్వతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు **ధర్మవరం:** తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించి భక్తుల మనోభావాలు దెబ్బ తీశారని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కొత్తపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రాయశ్చిత్త దీక్షలో మధుసూదన్‌రెడ్డి, ఆయన సతీమణి ఛాయాదేవి, జనసేన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అత్యాచారంపై కేసు

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడటంతో కేసు నమోదైందని ఎస్సై నాగస్వామి సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి మహిళ బహిర్భూమికి వెళ్లి వస్తుండగా నిందితుడు అత్యాచారం చేసినట్లు పేర్కొన్నారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

దంపతులకు తీవ్ర గాయాలు

రామగిరి, న్యూస్‌టుడే: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని దంపతులిద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం కుంటిమద్ది గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు. ధర్మవరానికి చెందిన నరేష్, భార్య పద్మావతితో కలసి రామగిరి నుంచి ధర్మవరం వెళుతుండగా కుంటిమద్ది సమీపంలో మరో ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో నరేశ్ కాలు విరిగింది. పద్మావతి నడుముకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.

ముందుంది దసరా..

ఆకాశాన్నంటిన ధరలు

● సామాన్యుడికి అందనంత దూరంలో నిత్యావసరాలు,

ముదిగుబ్బ, పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: దసరా పండగ మరో పదిరోజులుండగా నిత్యవసరాలు, కూరగాయల ధరలు ఇప్పుడే ఆకాశాన్నంటాయి. నిత్యం వంటల్లో ఉపయోగించే నూనెలపై రూ.50, తెల్లగడ్డలపై రూ.200, కూరగాయలపై రూ.50 వరకు ధరలు పెరగడంతో సామాన్యులకు చుక్కలు కనపడుతున్నాయి. వరదలతో తెలంగాణ, కోస్తాంధ్ర ప్రాంతంలో పంటలన్నీ నీటమునగడంతో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. సామాన్యుల బడ్జెట్ తలకిందులవుతోంది.



ముదిగుబ్బ మార్కెట్లో కాయగూరల విక్రయం

సామాన్యులు కొనేదెలా..- మంగమ్మ, నల్లచెర్లోపల్లి, ముదిగుబ్బ

నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోతే సామాన్యులు ఎలా కొనాలి. కూరగాయలకు నెలవారీ కేటాయించే డబ్బులు ఏమాత్రం సరిపోవడం లేదు. మగ్గం నేస్తూ వచ్చే ఆదాయంతోనే జీవనం సాగిస్తూ కుమారుడు జగదీష్‌ను బీటెక్, కూతురు దీక్షితను ఇంటర్ మొదటి సంవత్సరం చదివిస్తున్నాను. ధరలు పెరగడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

గడచిన రెండునెలల్లో ధరలు ఇలా..

కూరగాయలు	ఆగస్టు	సెప్టెంబరు
టమాట	20	40
వంకాయ	40	60
బీర	40	80
కాకర	50	80
ఆలుగడ్డ	50	60
ఉల్లి	30	75
క్యారెట్	30	80
బీట్‌రూట్	40	80
అల్లం	100	150

నిత్యవసరాలు	ఆగస్టు	సెప్టెంబరు
పామాయిల్	110	170
టెంకాయలు	16	30
తెల్లగడ్డలు	250	450
కందిబేడలు	140	180
శెనగబ్యాళ్లు	60	100
వేరుసెనగ	120	190
అలసందబ్యాళ్లు	50	100

దారులు లేవు.. మురుగు సాగదు..

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: దాదాపు నలభైఏళ్ల కిందట ఏర్పడిన పిల్లవంకకాలనీలో రహదారులు లేవు. మురుగునీటి కాలువలు కనిపించవు. 250 కుటుంబాలకుపైగా నివాసం ఉంటున్న కదిరి-హిందూపురంరోడ్డులోని పిల్లవంకకాలనీ మౌలిక సదుపాయాల విషయంలో మారుమూల గ్రామాన్ని తలపిస్తోంది. నివాసాలులేని రజకులు, నాయీబ్రాహ్మణులను గుర్తించిన అప్పటి ప్రభుత్వం 1985లో పిల్లవంక వద్ద దోబీఘాట్ కేటాయించి అక్కడే ఇళ్ల పట్టాలను మంజూరు చేసింది. వివిధ పథకాల కిందట ఇల్లు నిర్మించుకున్న కాలనీవాసులు అప్పటి నుంచి అక్కడే నివాసం ఉంటున్నారు. కాలనీలో రిజర్వు స్థలాన్ని కేటాయించారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ స్థానికులు కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా కాలనీలో కొందరురోడ్డు మధ్యలో పైపులైను కోసం గుంతలు తవ్వారు. వాటిని పూడ్చి వేసి ఇబ్బందిలేకుండా చూస్తామని తెలిపారు.



పిల్లవంకకాలనీలో దారిమధ్యలో మట్టిదిబ్బలు